# నాలుగు దినాలు

"ఏటి బాబు! సొతంత్రం వొచ్చిందన్నారు. కామోసనుకున్నాం. గాందీ నెహ్రూ బాబుల పరిపాలనన్నారు. సీరామచందురుడే తిరిగి బూమ్మీద అవుతురించినట్టు రామరాజ్జెం తెచ్చీస్తారనుకుండిపోనాం. ఇంతలో గాందీ బాబుని గుండేసి కాల్చీసినారు. తెల్లోడే గాందీబాబుని ఏటి సెయ్యనేక జైల్లో పెట్టి యెంటనే ఒగ్గీసీవోడు. ఆడికి సేతకాని పని మనోల్లే నిముసంలో చేసీసినారు. ఆపైన నెహ్రూ బాబే పొట్టి సీరాములు బాబుని పొట్టనెట్టుకొన్నాడు. తెలుగు దేసం వొచ్చీసింది. ఒరేయ్ తెలుగు అప్పలకొండా నువ్వే ఇంక రాజువిరా అన్నారు. నే నమ్మలా! కాని సిన్న ఆశపడ్డాను. మునిసిపాలిటీలో సీపురుచ్చుకొని వీధులూడ్చే సీపరుద్యోగంలో నాకేటి పదవులిచ్చేత్తారు! ఇవ్వనేదు సరే! తెలుగు దేశం పార్టీ పవర్‌నోకి వచ్చింది. అప్పుడు 'ఓరి! అప్పలకొండా నీకు యాబై పైన మరో అయిదొచ్చీసినాయిరా! ఇంక రిటేరు అయిపోరా' అన్నారు. మూడేళ్ళు ముందే అయిపోనాను. సొతంత్రం వొచ్చినా తెలుగు రాస్టం వొచ్చీసినా, మొత్తం దేశమే వొచ్చీసినా ఏటి బాబు! పేదోడి బతుకులో మార్పేటుంటాది."

ఈ ఊసులాడ్తున్న అప్పలకొండ నాకు సొయాన సిన నాయన. మా నాయనకి సొయాన తమ్ముడు. నాను పుట్టిన మూడేళ్లకే మా నాయన ఏరాడ కొండ కాడ ఓడల్దారి దాట్తూ నావతో పాటు మునకేసీసాడు. మా సిననాయనే నాకు అయ్యా అన్నా! నాకంటే పదమూడో, పద్నాలుగో ఏళ్లు పెద్ద. మా యమ్మ కంటే ఏడెనిమిదేళ్లు సిన్న. మాయమ్మ దురగమ్మ గారింటోను మరో బామ్మర్లింటోను పాచిపని చేసేది. ఆదిబాబు కొట్టో పప్పులు ఉప్పులూ బాగు సేసేది. నన్నూ మా సిన్నాయన్ని తనే సాకేది. ఉప్పుడో రేపో సొతంత్రం వచ్చుద్దన్నగా మా సిన్నాయన మా సిన్నమ్మని మనువాడి యేరే ఎల్లిపోనాడు. నా కప్పుడు ఏడో ఎనిమిదో వొయిస్సు. మా సిన్నాయన పాటలు బాగా పాడేటోడు.

నాకో పాట గుర్తుంది. "ఏరాడ కొండ మీద సానున్నది. ఏగాణి దబ్బులకి రానన్నది" అంటూ పాడేవోడు. అదిగో ఆ పాట నాను పాడ్తుంటేనే "గుంటడ్ని సెడ గొట్టకు" అంది మాయమ్మ మా అప్పల కొండ సిన్నాయన్తో.

అదిగో ఆ మాటకి మా సిన్నాయన సింవాచలం కొండ మీద నాగుపాంవు లాగా బుస్సుమని కస్సుమని, సిన్న ముఖంతో వేరింటి కెళ్ళిపోనాడు. కాని ఇప్పటికే నానంటే ప్రేమే. అందుకే అప్పుడప్పుడు ప్రేమగా ఊసులాడటానికి వత్తాడు. ఏటేటో గుర్తుచేస్తాడు.

ఈ దినం మీరు నా మాటలాలకిత్తున్నారనో మరేటో గాని నా సిన్నతనమంతా కల్లముందు సినేమా నాగా ఆడ్తా ఉంది.

* * *

ఆ మర్నాడు సొతంతరం వొచ్చే దినం. సొతంతరం అంటే నాకేటి ఎరుక! ఏటీ నేదు. సుబ్బరంగా ముసుగుదన్ని, సూరీడు కంట్లో పొడవకుండా తొంగుడుండి పోనాను. మా యమ్మ గొణుగుడు నా సెవుల పడతానే ఉంది.

"ఓరి సిɔవాసెలం. ఇంకా తొంగుండి పోనావేట్రా! నెగు! నెగు! నెగరా అయ్య! ఆదిబాబు కొట్టు కట్టు కొత్తానని ఆ బాబుకి సెప్పాన్రా... ఏటి నెగుస్తావా, సెంబుడు నీల్లు దిమ్మరించీసీదా!"

అమ్మ వోర్నింగిచ్చీసింది. ముసుగు కొద్దిగా తొలగించి సూద్దును కదా, వాల్టర్ టేసన్లోకి కలకత్తా మెయిల్ దూసుకొచ్చీసీనట్టు, సూరుకింద దూరి నోపలికి సెంబుతో వస్తా ఉంది. టక్కున నేచిపోయి, మా యమ్మని తప్పించుకొని బయట పడి, గోలం లోని నీల్లతో ముకం సేసేసి నోపలికి వొచ్చి అమ్మ ఇచ్చిన కాపీ బిల్ల కాపీ ఓ గుక్కలో తాగేసి గూట్లోంచి పైనా తీసి జుట్టుకి నీల్లు రాసి క్రాపు ఎగదువ్వి రెడీ అయిపోనాను.

ముందుగా నేను మా యమ్మ దురగమ్మ గోరింటి కెల్లినాɔవు. అమ్మ తప్పేలాలు ముందేసుకొని కూకుంది. మా ఇంట్లో అన్నీ సిల్వర్ తప్పేలాలే! ఇయ్యింట్లో ఇత్తడి తప్పేలాలు, ఎండి కంచాలు, పింగాణీ బొచ్చెలు – ఎన్నోటో! నేను ఎగిరెగిరి బోరింగ్ కొట్టి నీల్లందిస్తా ఉంటే అమ్మ తప్పేలాలు తోమేసింది. అమ్మ సీపురట్టుకొని గదులూడ్సీడానికి రెడీ అయిపోతుంటే –

"ఒసే నూకాలూ! రేపు పెద్ద పండుక్కదే! ఇయ్యాల బూజులు దులిపి ఇల్లు కడిగి ముగ్గు లెట్టే!" అంది దురగమ్మగోరు.

అమ్మ బూజుల కర్రందుకొని బుజూలు దులుపుతుంటే నాను సీపురట్టుకొని కింద ఊడుతున్నాను. నాకు సీపురట్టుకోటంలో సులువులు మా సిన్నాయన సెప్పాడు. ఆ టయాంలో దురగమ్మగోరన్నారు గందా!

"ఏటే నూకాలు! నువ్వేమో సినదానివి. మీలో నేమో మారు మనవులున్నాయి! నువ్వు మరో మనువెల్లరాదా" అని.

"నా మారుటి మగడు, నా బొట్టెడిని కొడుకునాగా సూసుకోగలడా! వొయిస్సుదేɔ వుందిలే తల్లీ! కల్లు మూసుకొంటే గడిసిపోద్ది" అంది.

మా యమ్మకి నేనంటే పేనం!

నాను ఊడిసిన గదుల్ని అమ్మని కడగమంది దురగమ్మగారు. అమ్మ మాటాడకుండా కడతగతా ఉంటే–

"ఏటే నూకాలు! రైకేసుకోరాదుటే! వొయిస్సులో ఉన్నదానివి" అంది దురగమ్మగోరు.

వంగుని కడుగుతున్న అమ్మలేసి నిలబడి–

"అమ్మా! మీరు కంపెనీ బాడీలేసుకోరేం?" అని అడిగింది.

"సీ! నేనేం సినిమాదాన్నిటే" అంది ఆవిడ.

"అమ్మా! నాకు పెల్లయేసరికి పదేను లేవు సరిగా, పెల్లయిన మర్నాడే మా అత్తమ్మ 'మనం సాన్లం కామే కోడలా! రైకలేసుకొని సోకులు సేసుకోడానికి. పనీపాటలకెల్లే వోల్లం. కూసంత మగనాలి నాగుండు' అంటూ మా అత్తమ్మ రైక తీయించింది" అంది అమ్మ.

దురగమ్మగోరాదినం ఎందుకు ముకం అదోలా పెట్టిందో ఈ దినం నాకు తెలుసు.

ఆవిడ మర్నాడు పండుగంటూ సానా సాకిరీ సేయించింది ఆ దినం, మా అమ్మ చేత. బామ్మర్ల ఇంటోను అంతే అమ్మకి రెక్కలు గుంజీసినాయి.

అప్పుడు మా యమ్మ నన్ను ఆదిబాబు కిరాణా కొట్టు కట్టుకు పోయింది. ఆదిబాబు సాపుకి రంగురంగుల కాయితాల జండాలు దారానికంటించినయి సాపు సుట్టూ పనోడి చేత కట్టిత్తా ఉండాడు.

"కుర్రాడు మరీ పీలగా ఉన్నాడే! పనేటిసేత్తాడు" అన్నాడాదిబాబు నన్ను సూడగానే.

"పీలగ ఉన్నోల్లే సెలాకీగా పనిసేత్తారు. దిబ్బగున్నోల్లు పనేటిసేత్తారు" అంది మా అమ్మ.

ఆదిబాబు బస్తానాగా దిబ్బగుంటాడు. పనేటి సెయ్యడు గామోసు. అది విననట్టు.

"ఉప్పుడే సెప్పేత్తున్నాను. నానీ గుంటడికి రోజుకి భేడబ్బులిత్తాను. నెలజీతం నేదు" అనేసినాడు.

నాకు నోరూరి పోనాది.

"అమ్మా నేను జీల్లు పిప్పలమెంట్లు రోజూ కొనుక్కుతింటానే" అన్నాను ఆసగా.

అమ్మ అది యినిపించుకోక, "డబ్బులొద్దు. రోజూ కూలికి నూకలిచ్చి పంపించు" అంది.

"బేడ డబ్బులకీ రేసన్రోజుల్లో నూకలేటొత్తాయే" అన్నాడాదిబాబు.

"వచ్చినన్నే ఇయ్యి. అయినా రేపు సొతంతరం వత్తుందంటగా - వచ్చినాక కూడా బియ్యం సేరారణాల కమ్మవా! దొంగసాటుగా రూపాయి పావలాకే అమ్ముకుంటావా! రేసనెత్తీరా. రేసనున్నా నెహ్రూ గాందీ బాబులు దొంగయాపారం సేసేవోల్లని జైల్లో ఎట్టీరా?" అంది అమ్మ.

"నూకాలు! నువ్వు కాంగిరేసులో సేరిమంత్రివైపోయి నన్ను పట్టిచ్చెయ్యి" అన్నాడు ఆదిబాబు.

"హాసికాలకేటిబాబు! గుంటడ్ని ఎప్పటి నుంచి పన్లోకంపేది?" అనడిగింది.

"ఎవలూ కొని సచ్చేది లేదు ఈ రెండు మూడు రోజులు. మొదటి తారీకు నుంచి పంపు" అన్నాడాదిబాబు.

"చౌదర చౌదరీమణులార్నా! కొలాయిమూతులార్నా! సున్నప్పిడతలార్నా! రేపు సొతంతర దినం" అంటూ మోహనదాసు కరమచందర గాందీ ఉపన్నాసం ఇత్తా ఉండాడు. దాసు దురగమ్మ గోరి కొడుకు. నా యీడోడే! సుట్టూ తెలగాల పిల్లడు, గవర్లపిల్లడూ, పెరికీల పిల్లడు కూర్సుని సప్పట్లు కొడతా ఉండారు.

"సింవాసెలం! రేపట్నుంచి నీకు సొతంతరం రా! నీ కిట్టంలేని పని సెయ్యక్కర్నేదు" అన్నాడు దాసు.

"దాసూ! అయితే నేను ఆదిబాబు కొట్నోకి పనికిపోనక్కరనేదా! నాను నీలాగా బడికెల్లి సదూకోవచ్చా?" అని ఆసగా అడిగాను.

"ఆ సొతంతరం నీ కుంది" అన్నాడు దాసు.

ఆ రాతిరి సరింగా అర్ధరాతిరికి, నాకు, దాసుకి, మా యమ్మకి సొతంతరం వత్తుందంట, నాకు నిద్దర పట్టనేదు. మా సిననాయనొచ్చి "రేతిరికి పంపాన కోంసిలరు, విస్సి నాదంబాబు, ఊల్లో ఇంకా పెద్దోల్లు, డబ్బునోల్లు, దేసబత్తునోల్లు టపాకాయలు కాలుత్తా(్రా. ఆల్లు ఇల్లా టపాకాయలు కాల్సీగానే, అలా సొతొంతరం వచ్చుద్ది. నెహురూ బాబు డిల్లీలో కాంగిరేసు జండా ఎగిరేత్తాడు" అన్నాడు.

రాతిరి దనదనా టపాకాయలు మోగాయి. నా సిన్నప్పుడు జపానోల్లు వేసిన బాంబుల సప్పుడులు గుర్తుకొచ్చినయి. కాని ఉప్పుడు బయం వెయ్యనేదు. సంతోసమే!

పొద్దుటేల నెగిసినప్పటి నుంచి వీదినోకి ఒప్పుడు పారొద్దారా అనే! మా యమ్మ నన్ను నేపనేదు. నానే బేగి నెగిసిపోనాను. పందుంపుల్లెట్టి ముకం సేసినాను. కాపీ బిల్ల కాపీ తాగేసినాను. దాసుబాబిచ్చిన సొక్కా నాగుకొత్తయి - దాసుక్కాదు నాక్కొత్తయి- యేసుకొని యీదినోకి ఉరికినాను.

సెట్టు సెట్టుకీ, కొట్టు కొట్టుకీ, పూరింటికి మిద్దింటికీ, ఆపీసులకు, బల్లలకి - ఆకరికి పెద్ద దరమాసుపత్తిరికి కూడా మూడు రంగుల జెండా, అదే ఆ పాట నోది, తిరివర్నాం సిత పతాకం' కట్టేసినారు. వోలిండియా రేడియో 'ఉదయమ్మాయెను సేచ్చా బారతము దయమ్మాయెనహో', అంటూ మోతెత్తి పోతా ఉంది. నా వొయిసు కుర్రాల్లందరు సొక్కాజేబీలకి అలిపితో కాయితం జెండాలు నెహురూ బాబు గులాప్పువ్వెట్టు కొంటాడే ఆనాగేట్టుకొని తిరిగెత్తున్నారు.

దాసు ఇంటికి లగెత్తుకెల్లి "నాకో జెండా యియ్యవా" అని అడిగినాను.

"అయిపోనాయిరా. ఆగాగు..." అంటూ లోపలికి వెల్లి కాయితం తెచ్చి రంగు బిల్లలు నీల్లలో కరగబెట్టి, కుంచెలో జెండా బొమ్మ ఏసి దాన్ని ఓ పుల్లకి అంటించి సేతిలో పెట్టేసినాడు. జేబిలో సిన్న జెండా నేకపోయినా ఉప్పుడు నా సేతిలో పెద్ద జెండాయే ఉన్నాది.

బల్ల కెల్లిన పిల్లలు లడ్డూలు, బిల్లలు తింటూ జెండా ఎగరేసి వత్తున్నారు. గవర్లకుర్రోడు నా సేతిలో సిన్న పిసరెట్టినాడు. ఆకలేసి ఇంటికెల్లే సరికి మా యమ్మ పనులు ముగించుకొచ్చినాది.

"నిన్న రెక్కలు గుంజీసీలా పని సేయించుకొన్నా ఆకలెరిగిన దాయిలు నీకూ నాకు పంచబచ్చు పరమాన్నాలెట్టార్రా" అంది మా యమ్మ. మా యమ్మ ముకం జెండాలా ఎలిగిపోతా ఉన్నాది.

అదిగో అన్నాగ ఆ సొతంతర దినం నానీ నాటికి మర్సిపోనేదు.

నాకు సొతంతరం వచ్చినాది కదా! నా నూరు కోనేదు. అమ్మతో నా నాదిబాబు కొట్లో సేరనని సెప్పి మా సిన్నాయన్ని నన్నుబల్లో సేర్సమన్నాను. మా సిన్నాయన, బాగు మల్లు సావుకారిల్లు దాటి మాంసం కొట్ల మీదుగా నన్ను తోలుకెల్లి, దుంపల బల్లోసేర్పించినాడు. దుంపల బడిలో తిండానికి మునిసిపాలిటీవోల్లు దుంపలిచ్చీవోరు. అయ్యా రోజుల్లో ఒవరూ తినడం లేదు కాని మా సిన్నప్పుడు సానామంది తినేటోల్లు. మా రుసిగా ఉంటాయి. సవగ్గా ఉంటాయి. అయి కూడా ఉత్తినే, బల్లో ఇచ్చినట్టు బయటిచ్చీరు కదా! దుంపల్తింటూ సదువుకోటం మొదలెట్టినాను. ఇంతలో బల్లకి దసరా సెలవులు – ఆ పైన దీపావళి సెలవలు – ఆపైన సంకురేతిరి సెలవలు అంటూ బడి సానా దినాలు సెలవలొచ్చీసినాయి.

మల్లీ బడి తెరిసేరో నేదో దాసు, "చౌదర చౌదరీమణుల్నారా! సున్నప్పిడతల్నారా! కొళాయి మూతుల్నారా! సోక వోర్త. గాందీ గోర్ని గుండేసి కాల్చీసినారు" అన్నాడో సాయింతరం.

దురగొమ్మగోరు ఆ బాబుని సెడతిట్టారు.

"నోటికి సుద్దీ బద్దీ ఉండాలి. గాందీ బాబు నెవరు సంపుతార్రా. ఆయన దరమరాజు. సెత్రూల్నేరు ఆయనకెవరు" అంది.

దాసు లోపలికెల్లి వోలిండియా రేడియో గట్టిగా పెట్టేసినాడు. అందులో సన్నాయిలు, పిడేల్లు కుక్కలు కూస్తున్నట్టు వోయిత్తున్నారు. మద్దె మద్దెలో ఇంగిలీసులో, ఇందీలో పెద్దోరు ఏదో అంటున్నారు.

"నిజమేరా దాసు. కలికాలం. మనోల్లేట కాల్చీసింది. తురకోల్లు కాదుట. చాంతంగా ఉండమంటున్నాది పెబుత్వం" అంది దురగమ్మ.

ఊరంతా ఎవరికి మటుకు వారింట్లోనే సెవం నెగిసినట్టు సోకాలెట్టీ వోరు, కూడొండుకుని తిననోల్లు, ముకాలు ముడిసేసుకున్నోల్లు అయిపోనారు. ఇయ్యాల సాయింతరం దాకా దర్జాగా కొయ్యసివర యెగిరిన జండాలు మద్దెకి దిగిపోనాయి.

* * *

సాన్నాల్లు బల్లు మూసీసారు. సాపులు మూసీసినారు. ఏ కాంగిరేసోడు కర్రలుచ్చు కొని మూయించనేదు! మినర్వా టాకీసులో గాందీ గోరిని ఊరేగించి, బూడిద చేసినప్పుడు తీసిన సినిమా కాస్డబ్బు తీసుకోకుండా సూపించినారు. నానూ అమ్మా చూసాం. ఏం జనం! ఏం ఊరేగింపు ఎల్లిపోనాడు పెదబాబు సొరగాని కెల్లిపోయినాడు. మళ్ళీ బల్లు తెరిసారో నేదో అమ్మకి ఊష్ణం వొచ్చింది. వొంటి మీద గేనం నేదు. బడి మానేసి అమ్మని సూసుకొంటూ ఉండిపోనాను. మా సిన్నాయన మంచోడు. అన్నం, సారు అన్ని దినాలు మా సిన్నమ్మ సేత పంపించినాడు. నా సదువు సంకనాకి పోనాది. నన్ను అదే తరగతిలో ఉంచేసినాడు పెద్ద పంతులు.

"నేను సచ్చిపోయినా బావుండేది. మీ సిన్నాయన నిన్ను సూసుకునేవోడు" అని అమ్మ ఆ రోజు సోకాలెట్టింది.

"వొద్దే నాకు బడొద్దే. నువ్వే కావాలే" అంటూ మర్నాడే నా అంతట నానే పోయి ఆదిబాబు కొట్నో సేరిపోనాను.

* * *

నాలుగేల్లు గడిసినట్టున్నాయి. పొట్టి సీరాములు బాబు అన్నం నీల్లూ ముట్టుకోకుండా ఉపవాసం సేసి తెలుగు రాస్టం కోసం సచ్చిపోనాడు. రాజాజీ, నెహురూ కలిసి సంపేసారుట. గాందీగోరు ఉపవాసం సేత్తే, ఆయన కోరిందల్లా ఒప్పేసుకొనే వారుట, ఆ బాబు లిద్దరు. అదే సీరాములు – బాబిసయంలో ససేమిరా అంటూ మొండి కేసీసారు. దాంతో తెలుగోల్లు రెచ్చి పోనారు. కుర్రోల్లు స్టైయికులు సేసేసినారు.

"రాజాజీ పిలక ఆరనాఽ పరక" అంటూ అరుసుకుంటూ రోడ్నంబటి పోతున్నారు. ఏమాట కా మాటే సెప్పుకోవాల. మా యమ్మనో నన్నో దురగమ్మగోరు రూపాయి పావలా ఇచ్చి పోలీసోల్ల ఇల్లకి పంపేది. హెడ్డుగోరి బార్య ఒక సేరు బియ్యమిచ్చేది. తెచ్చి ఆ యమ్మ ఇంట్నో పడేసేవోల్లం. రాజాజీ బాబు ముక్కెమంత్రయినాక ఈ జెస్ట,రేసను ఎత్తి పారేసినాడు. దాంతో బియ్యం సేరు ముచ్చాకయి నెల తిరక్కుండా ఆరణాల పరకైంది. పూర్నా మార్కెట్టులో అడిగినోడికి అడిగినంత బియ్యం. అంత మంచి రాజాజీబాబు పొట్టి సీరాములు సచ్చిపోడనుకున్నాడో ఏటో. అంతకుముందు సామీ సీతారాము ఇంకా ఎక్కువ దినాలుపవాసం సేసి బతికినాడు కదా! అన్నాగే ఇది తుస్సమని పోతాది అనుకొన్నాడు. అవనేదు. మలబారు పోలీసుల్ని దింపినాడు. ఆల్ల ఇనప టోపీలు సూస్తుంటే బయం యేసి పోనాది. కాని సూడెంట్లు దిగిరానేదు. ఆల్లుకాల్సక మాన్నేదు. ఆల్ల కాలిస్తే ఈల్లు మరింత పేట్రేగిపోనారు. సివరికి నెహురు బాబు దిగొచ్చినాడు. రాజాజీబాబు లొంగొచ్చినాడు.

తెలుగు రాస్టం సీరామనవమి సంబరాలంత పందిల్లతో ఎల్లమ్మ జాతరంత సంబరంతో వచ్చింది.

"మా తెనుగు తల్లికి మల్లెపూదండ" అన్న పాట సెవులు రింగుమని మారుమోగేలా, మైకులెట్టి ఊరంతా పాడేసింది. కాని మా సిన్నాయన ఆ తరువాత సెప్పాడు ఆ పాట రాసినాయన్ని సబలోకి రానీకుండా "నువ్వె వడవేస్" అంటూ పోలీసులు రెక్కట్టుకు ఈదిలో కీడ్సీసినప్పుడు, ఆ పాట రాసినోడు ఓడు బతికుండాల, అతగోడిని మనం ఓ దండేసి గౌరవించాల అని వోరూ గుర్తెట్టు కోలేదుట.

తెలుగు తల్లి ఆ దినం సంతోసించిందా? నేక సనిపోయిన సీరాములు బాబు కోసం కాలి పోయిన కుర్రోల్ల కోసం కన్నీరెట్టుకుందా? తెలీదు. ఏదైతేనేటి? ఆ దినం మర్సిపోనేక పోనాను.

* * *

ఆ తరువాత సానా జరిగాయి. తెలుగు రాస్టం వొచ్చీక తెలుగు సిఁవం పెకాసెంపంతుల్ని గద్దె దింపేసినారు. ఇస్సినాదం గోరు ఏటో అయిపోనారు. బానోజీరావు సెయిర్‌మనే అయిపోనారు. ఆపైన ఆరెవరండి - బెజవాడ ఆయన - ఆయన్దసలు నెల్లూరుట - ఆయన మూన్నాల్లు రాజ్జెం ఏలాడు. బెజవాడని, ఇసాకపట్టనంని కాదని రాజదానిని కర్నూలట్టుకుపోయి నోయినే గద్దెక్కేసినాడు. నాకు గానం అప్పటికి కూసింత కూసింత వత్తా ఉండాది.

ఆ తరువాతా సాన్నాల్లకి, "ఊగరా! ఊగరా! ఉరికొయ్యకూగరా" అంటూ సిన్న కుర్రనాయాల్లకి ఉద్దిరేకం కలిగించే పాటలు "బద్రం కొడుకో!" అంటూ ఆల్ల జీవితాలకి బద్రత నేకుండా సేసే పాటలొచ్చాయి. ఆదిబొట్ల కైలాసాలు, వెంపటావు సత్తాలు పోనారు. సాంబసివరావు, బూసనం మేస్టర్లు ఎటో పోనారు. మా అప్పలకొండ సిన్నాయన ఆల్లకి కబుర్లు సేరేసేవోడని నేటుగా మా కెరుకైంది. ఎరుకయ్యేసరికేటి మిగిలింది!

మా అప్పలకొండ సిన్నాయన రిటేరయినా కనపడకుండా పోవాడు. మా మొహనదాసు కరమ సెందర గాందీ తుపాకీ గొట్టాన్నమ్ముకుని ఆడవుల్నోకి ఎల్లిపోనాడా దినాల్లోనే.

మా సిన్నమ్మ, నా తమ్ముల్లనీ, సెల్లెల్లనీ వోటేసుకొని బెంగటిల్లిపోనాది. మాయమ్మది జాలిగుండె.

"ఓసి సెల్లా! నా కొడుకు నీ కొడుక్కాదుటే! నీకేరే యిల్లెందుకే వచ్చీసి మా దగ్గరే ఉండిపో! ఆడు, నాతోపాటు, ఆడిపెల్లాం పిల్లతోపాటు నిన్నూ నీ పిల్లల్నీ సూసుకుంతాడు. మనాడోల్లకి పాసిపనులు ఒప్పుడూ ఉంతాయి" అని తీసుకొచ్చీసినాది.

నానప్పుడు మునిసిపాలిటీలో మా సిన్నాయనేయించిన సీపరుద్యోగంలో సీనియర్ని. మా సిన్నాయన పెద్ద కొడుక్కి నా పరపతితో సీపరుద్యోగం ఏయించాను.

* * *

దాసుబాబు కాటికెల్లిన దినం సచ్చిపోయిన దినానికి నాలుగో దినం. రెండో రోజున అడవుల్లో ఎదురు కాల్పుల్లో సనిపోయినోల్ల సెవాల్ని టీవీలో సూపించారు. రత్తం

గడ్డకట్టి ఈగలు ముసుర్తున్న సెవం గాందీ దన్నారు. ఆ దినం దురగమ్మ గోరిని పట్టడం మాతరం కానేదు. పెద్దోల్లు, బాలగోపాలబాబు, వరవరరావు బాబు, గద్దరుబాబు, సెలసాని పెసాదు బాబు కిస్నాబోయమ్మ, ముక్కలుగా కోసి కట్టేసిన దాసుబాబుని ఆల్లింటికి సేర్సినారు. ఆ దినం దాసుబాబుని సావులమద్దుంమీదుగా ఊరేగించి కాటి కట్టి కెల్లినారు. దురగమ్మ గోరింటి దగ్గర జనాలు పోటీలు పడి దండలేసారు. పై ఊల్ల జనాలు రాకుండా పోలీసులు సేసినం పెయిత్నాలు పలించనేదు. జనం అమాసనాడు సొముద్రం పొంగినట్టు పొంగిపోనారు. అతడెంట జనం నడిసారు.

కట్టెలమీద బాబు నుంచారు. ఆ బాబు పెదాలు, "చౌదర చౌదరీమనులారా! కొళాయి మూతుల్నారా! సున్నప్పిడతల్నారా! నా సెవంతో మీ దారి నెవరూ మూయనేరు. ఏడవకండేవకండి!" అంతున్నాయని నా కనిపించింది.

దూరంగా మైకులో "తెలుగు వీర నేవరా!" అని పాటేస్తున్నారెవరో!

అక్కడో దిమ్మ మీద మా అప్పలకొండ సిన్నాయన కూర్సుని ఊసులాడ్తున్నాడు సుట్టూ సేరిన కుర్రోల్లతో. సెప్పటం మర్సిపోనాను. మా సిన్నాయన పోలీసులకి కిందటేడు నొంగిపోనాడు. టి.వి.లో సూపించారు. మేం సిన్నాయన బతికున్నందుకు సంతోసించాం. అయితే పెద్దోల్లు నొంగిపోతే మెచ్చి మేకతోలు కప్పినట్టు, మా సిన్నాయనకి కప్పనేదు. పైగా కోర్టుల్నో సిన్నాసితకా కేసులు ఓ అయిదింకా నడుస్తాఉన్నాయి.

"ఈ నోకంలో పవరెప్పుడు డబ్బున్నోడిదే. అందు సేతపెస్నె - పెబుత్వం నడుపుతున్నది కాంగిరేసోల్లా, తెలుగుదేసం వోల్లా, బిజెపీ వోల్లా అన్నది కాదు. అల్లలో ఓర్రైనా, ఆ గాందీ బాబైనా, ఈ గాందీ బాబైనా, మరో గాందీ బాబైనా తుపాకీన్నమ్మినా, అయింసనే నమ్మినా, సంపకమానరు. ఎందుకంటే ఆల్లు బీదోల్ల తరపున నిలబడ్తారు. నోర్నేని వోల్ల తరపున వోదిస్తారు.

"రేపటి దినం, ఉత్తి ఆంద్ర వొచ్చినా ఉత్తరాంద్రా వొచ్చినా, తెలంగానా వొచ్చినా వాల్లదే రాజ్జెం. వాల్ల మాటే సెల్లుద్ది. వాళ్ళ బాసే సెబాస్. మన బతుకులు బాగుపడితే నా సెవులు తెగ్గోయండి".

మా అప్పలకొండ సిన్నాయన సీకిష్ణపరమాత్మ నాగా గేనం బోదిస్తా ఉన్నాడు.

దాసుబాబు పేదోడి బతుకు నాగా కాలిబుగ్గవుతున్నాడు. ఆ బుగ్గాడవటానికి సీపురట్టుకుని నాను నిలబడిపోనాను.